

రైతులు అప్రమత్తంగా ఉండాలి

భీమవరం ఆర్‌డిఒ ప్రవీణ్ కుమార్ రెడ్డి

పాలకోడేరు : తుపాన్ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని భీమవరం ఆర్‌డిఒ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి సూచించారు. మండల కేంద్రమైన పాలకోడేరులో రోడ్డుపై రైతులు పోసిన ధాన్యాన్ని పాలకోడేరు తహశీల్దార్ ఎన్.వి.విజయలక్ష్మితో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను వ్యవసాయానికి సంబంధించిన పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంత మేర సాగు చేశారు, ఎంత మాసూళ్లు పూర్తి చేశారు, ఎంత మేరా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించారని వివరాలు అడిగారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ ప్రవీణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణం మార్పులతో ఇబ్బందులు పడకుండా ముందస్తుగా రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాలు తగ్గేంత వరకు వ్యవసాయ పనులు వాయిదా వేసుకోవాలని సూచించారు. ఆర్‌డిఒ వెంట మండల రెవెన్యూ అధికారి రాఘవ మూర్తి రాజు, విఆర్ఒ కోటేశ్వరరావు, రైతులు ఉన్నారు.

'ఫెంగల్' పరేషాన్..!

తుపాను ప్రభావంతో చిరుజల్లులు, మబ్బులు
రెండు జిల్లాల్లో నాలుగులక్షల ఎకరాల్లో వరిసాగు
ఇప్పటి వరకూ లక్షా 83 వేల ఎకరాల్లో కోతలు పూర్తి
2.95 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
ఇంకా కళ్లాల్లో 13 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం
వర్షం కొనసాగితే తీవ్ర ఇబ్బందులే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఫెంగల్ తుపాను ప్రభావం అన్నదాత గుండెల్లో వణుకు పుట్టిస్తోంది. శనివారం నుంచి వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. తుపాను తీరం దాటినప్పటికీ మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. శనివారం నుంచి జిల్లాలో పడుతున్న చిరుజల్లులు, మబ్బులతో రైతుల్లో ఆందోళన నెలకొంది. రెండురోజుల వరకూ కోతలు కోయొద్దంటూ అధికారుల సూచనలతో రైతులు వెనక్కి తగ్గిన పరిస్థితి. కళ్లాల్లో ఉన్న ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు రైతులు శ్రమిస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఏలూరు జిల్లాలో లక్షా 93 వేల ఎకరాలు, పశ్చిమగోదావరిలో 2.05 లక్షల ఎకరాలు మొత్తం దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఉంగుటూరు వంటి మండలాల్లో దాదాపు 80 శాతం వరకూ మాసూళ్లు పూర్తయిన పరిస్థితి ఉంది. ప్రస్తుతం ఖరీఫ్ మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో 2.05 లక్షల ఎకరాలకుగాను లక్షా 15 వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. ఏలూరు జిల్లాలో 68,117 ఎకరాల్లో కోతలు పూర్తవ్వడంతో రెండు జిల్లాల్లో లక్షా 83 వేల ఎకరాల్లో ఖరీఫ్ మాసూళ్లు పూర్తయిన పరిస్థితి ఉంది. ఇప్పటి వరకూ పశ్చిమలో లక్షా 45 వేల మెట్రిక్ టన్నులు, ఏలూరు జిల్లాలో లక్షా 51 వేల మెట్రిక్ టన్నులు మొత్తంగా 2.95 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి. మరో పది రోజుల్లో మాసూళ్లు దాదాపు పూర్తయ్యే అవకాశం ఉండగా ఫెంగల్ తుపానుతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. గతంలో ప్రకృతి వైపరీత్యాలతో ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేసుకుంటూ రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

ధాన్యం తడిస్తే ఇబ్బందులే..

కోతలు పూర్తయ్యి రైతులు ఆరబెడుతున్న ధాన్యం ఇంకా ఏలూరు జిల్లాలో ఎనిమిది వేల మెట్రిక్ టన్నులు, పశ్చిమగోదావరిలో ఆరు వేల మెట్రిక్ టన్నులు వరకూ ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. చిరుజల్లులకు ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు రైతులు నానావస్థలు పడుతున్నారు. టార్పాన్లు, బరకాలు వేసి కాపాడుకుంటున్నారు. ఇప్పటి వరకూ పరిస్థితి బాగానే ఉందని, వర్షం పెరిగితే మాత్రం ఇబ్బందులు తప్పవని రైతులు చెబుతున్నారు. ధాన్యం తడిస్తే మాత్రం రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఏర్పడనుంది. వర్షాలు కురిసినా ఇబ్బందుల్లేకుండా రైతులకు పూర్తిస్థాయిలో టార్పాలిన్లు అందించాలి. వర్షం కురిస్తే తేమ పేరుతో మిల్లర్లు ధరలో కోత పెట్టి అడ్డంగా దోచుకునే పరిస్థితి రానుంది. గతంలో రెండు జిల్లాల్లో తేమ పేరుతో దోపిడీ అత్యంత దారుణంగా సాగింది. మిల్లుకు చేరుకున్న లారీలను తేమ పేరుతో ఆపేసి ఆన్‌లైన్ ద్వారా సొమ్ము వేయించుకుని దిగుమతి చేసుకున్న పరిస్థితి నడిచింది. దీంతో అప్పటి పరిస్థితులను రైతులు గుర్తుచేసుకుంటున్నారు. వాతావరణం సహకరించిన తర్వాతే కోతలు కోయాలని రైతులు భావిస్తున్నారు. మిల్లర్లు కొత్త సమస్య తీసుకురాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. సోమవారం నుంచి వాతావరణం కొంత మెరుగయ్యే అవకాశం ఉంటుందని రైతులు అంచనా వేస్తున్నారు. వాతావరణ పరిస్థితుల మార్పుతో ఖరీఫ్ మాసూళ్లు ఆలస్యమయ్యే పరిస్థితి ఏర్పడనుంది. రెండు జిల్లాల్లో రైతులు రబీ నారుమడులు సైతం వేస్తున్నారు. తుపాను ప్రభావంతో నారుమడులు వేసేందుకు రైతులు వెనుకాడుతున్నారు. దీంతో రబీ నాట్లు ఆలస్యమయ్యే పరిస్థితి ఉంది.




ఆచంట వేమవరం పార్వతి చెరువులో నేలకొరిగిన వరి

ప్రతి పాఠశాలలో జ్యోతిరావు పూలే విగ్రహం

10 విగ్రహాలను అందించిన ఉండి ఎంఎల్ఎ రఘురామ కృష్ణంరాజు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భావితరాలకు మహనీయుల చరిత్ర తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ప్రతి పాఠశాలలో మహనీయుల విగ్రహాలు నెలకొల్పాలని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. ఆదివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో జ్యోతిరావు పూలే విగ్రహాలను పదింటిని సంఘసేవకుడు చెరుకువాడ రంగసాయికి అందజేశారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలేలు శతాబ్దాల క్రితమే విద్యా వ్యవస్థలో పలు సంస్కరణలు తీసుకొచ్చారని, పేద, బడుగు, బలహీనవర్గాలకు విద్య అందించేందుకు కృషి చేశారని కొనియాడారు. ప్రతి పాఠశాలలో ఏర్పాటు చేయడానికి విగ్రహాలు తయారు చేయించామన్నారు. సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 19 విగ్రహాలు తమకు అందించారని, ప్రస్తుతం పెదకాపవరం, జక్కరం, పాలకోడేరు పాఠశాలల్లో త్వరలోనే పూలే విగ్రహాలను ఆవిష్కరిస్తామని తెలిపారు. అనంతరం రఘురామకృష్ణంరాజును సత్కరించారు. కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ వేగేశ్న కనకరాజు సూరి, నేత కొత్తపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పూలే విగ్రహాలను అందిస్తున్న ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు

సుబ్బారెడ్డి మరణానికి సంతాపం

ప్రజాశక్తి - భీమవరం

ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు గాదె సుబ్బారెడ్డి హఠాన్మరణం దిగ్భ్రాంతి కలిగించిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మరణం చాలా బాధాకరమని, ప్రజానాట్యమండలి రాష్ట్ర సాంస్కృతిక ఉద్యమం ఉత్తమ నటుడు, ప్రతిభావంతమైన దర్శకుడిని కోల్పోయిందని పేర్కొన్నారు. ఈలోటు పూడ్చలేనిదని, దీర్ఘకాలంగా ప్రజా నాట్యమండలిలో ప్రజా కళాకారుడుగా సేవలు అందించిన సుబ్బారెడ్డికి జోహార్లు అర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన మరణానికి తీవ్ర సంతాపం, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వీడని వర్షం.. ఆందోళనలో రైతాంగం

ప్రజాశక్తి - ఆచంట

ఫెంగల్ తుపాన్ ప్రభావంతో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈదురుగాలులతో కూడిన చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. దీంతో రైతులు, జనం ఇబ్బందులు పడ్డారు. మూడు రోజులుగా వాతావరణం అనుకూలించకపోవడం, శని, ఆదివారాల్లో వర్షం కురవడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. చేతికొచ్చిన పంట దక్కుతుందో, లేదోనని రైతులు తలలు పట్టుకుంటున్నారు. యంత్రాలతో కోసిన ధాన్యం ఆరబెట్టుకోవడానికి వీల్లేకుండా వర్షం కురుస్తూనే ఉండటంతో ధాన్యం రంగు మారే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ధర తగ్గే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

నేలనంటిన పొలాలు

ఈదురు గాలులతో కూడిన వర్షం కారణంగా ఆచంట, పోడూరు మండలాల్లో పంట పొలాలు నేలనంటాయి. పడిపోయిన వరి దుబ్బులను నిలబెట్టి కట్టుకునేందుకు అదనపు ఖర్చవుతుందని రైతులు లబోదిబోమంటున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.28 వేల వరకూ పెట్టుబడులు పెట్టామని, చేసిన అప్పులెలా తీర్చాలో తెలియడం లేదని చెబుతున్నారు. మండలంలో ఆచంట, కొడమంచిలి, పెనుమంచిలి, కోడేరు, కరుగోరుమిల్లి తదితర ప్రాంతాల్లో ఇప్పటి వరకు 40 శాతం మాసూళు పూర్తయ్యాయి. మరో 60 శాతం కోత దశలో ఉన్నాయి. వాతావరణం అనుకూలిస్తే పది రోజుల్లో మాసూళ్లు పూర్తవుతాయని రైతులు చెబుతున్నారు.



ఆచంటలో కురుస్తున్న వర్షం

జగనన్న కాలనీలో సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

ప్రజాశక్తి - నరసాపురం

లక్ష్మణేశ్వరం జగనన్న కాలనీలో రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు డిమాండ్ చేశారు. ఆదివారం కాలనీవాసులు స్థానికంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో పెద్దిరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు సంవత్సరాల క్రితం కాలనీ నిర్మాణం పూర్తయిందని, అయితే ఇప్పటి వరకూ అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడం వల్ల వర్షపు నీరు, వాడకపు నీరు కాలనీలోనే పేరుకుపోయి మురుగుగుంటలుగా మారాయన్నారు. దోమలు విపరీతంగా పెరగడం వల్ల కాలనీవాసులు రోగాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్ల సౌకర్యం లేకపోవడం వల్ల ప్రజలు బయటకు పోవడానికి నానావస్థలు పడాల్సి వస్తుందన్నారు. పిల్లలు బడికి వెళ్లడానికి చాలా అసౌకర్యంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం వస్తున్న కుళాయి నీరు కూడా కలుషితంగా ఉందన్నారు. కాలనీ సమస్యలు తక్షణం పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని పెద్దిరాజు హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్‌రావు, పంచాయతీ వార్డు సభ్యుడు ముల్లేటి నాగదేవి, స్థానికులు దిగమర్తి బేబీ, వీరవల్లి బాలకృష్ణ, నిల్ల వెంకటేశ్వరరావు, పెమ్మాడి వెంకటలక్ష్మి, దొంగ శివగంగ, కారుమంచి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవి బాధితుల పట్ల వివక్ష తగదు

ఎయిడ్స్ డే సందర్భంగా పలుచోట్ల అవగాహనా ర్యాలీలు

ప్రజాశక్తి - గణపవరం

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై ఎటువంటి వివక్ష లేకుండా చూడవలసిన బాధ్యత అందరిపైనా ఉందని పిఎంపి అసోషియేషన్ జిల్లా అధ్యక్షులు ఎఆర్‌కె పరమేశ్వర్లు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం పిఎంపి అసోషియేషన్ మండల కమిటీ ఆధ్వర్యంలో సరిపల్లిలో ఎయిడ్స్‌పై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పరమేశ్వర్లు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి అంతం చేయడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, నివారణా మార్గం ద్వారా నివారించవచ్చునని తెలిపారు. ఈ ర్యాలీలో అసోషియేషన్ అధ్యక్షులు ఎం.సత్యనారాయణ మూర్తి, ప్రధాన కార్యదర్శి శివ శ్రీనివాస్ రావు, కొటకల అప్పారావు, పానకాలు, సిహెచ్.సత్యనారాయణ పాల్గొన్నారు.



గణపవరంలో..

పాలకొల్లు రూరల్: లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిని నిర్మూలించడానికి ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించి ఎయిడ్స్ వ్యాధి రహిత సమాజాన్ని స్థాపించాలని కోరారు. జిల్లా పారామెడికల్ అధికారి జక్కంపూడి రాంప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎమ్.నవ్య జీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, ఫార్మసిస్ట్ పివి.స్వామి పాల్గొన్నారు.

ఉండి : హెచ్ఐవి నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ బి.సాయిచంద్ర అన్నారు. ఆదివారం ఎయిడ్స్ డే సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు నివారణలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో తమ బృందం హెచ్ఐవి నివారణకు, నియంత్రణకు చేసిన అవగాహనా కార్యక్రమాల కృషిని గుర్తించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.ఉమామహేశ్వరరావు ప్రశంసా పత్రాలను తనకు అందజేసినట్లు ఆయన వివరించారు. ల్యాబ్ టెక్నీషియన్ పి.శ్రీదేవికి ప్రశంసా పత్రాన్ని అందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ భాను నాయక్, యాంటీ రిట్రో వైరల్ థెరపీ సెంటర్ మెడికల్ ఆఫీసర్ గోవిందుబాబు ఉన్నారు.


ఆకివీడు : అక్రమ సంబంధాల కారణంగా ఎయిడ్స్ సంభవిస్తుందని, స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రభుత్వం, అవగాహనా సదస్సులు నిర్వహించడం వల్ల ఎయిడ్స్ రోగుల సంఖ్య గణనీయంగా తగ్గిందని సర్దార్ కాటన్ ఆకివీడు మండల వృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక వృద్ధుల సంఘం విశ్వ కీర్తి టైప్ సెంటర్‌ల ఆధ్వర్యంలో డాక్టర్ కె.జానకి నివాసం వద్ద ఎయిడ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 50 మంది ఎయిడ్స్ రోగులకు ప్రత్యేకంగా తయారు చేయించిన పోషకాహారం, దుప్పట్లు పంపిణీ చేశారు. ఎయిడ్స్ మెంటర్ పావని(చిన్ని), వృద్ధుల సంఘ సభ్యులు పేర్ల ప్రసాద్‌లు పలు అంశాలను వివరించారు. పలువురు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

టీచర్స్ ఎంఎల్‌సి ఉప ఎన్నికకు సర్వం సిద్ధం

5న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్
ఓటు హక్కు వినియోగించుకోనున్న 3729 మంది ఉపాధ్యాయులు
జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు
3వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి జిల్లాలోని అన్ని మద్యం దుకాణాలు మూసివేత
జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - భీమవరం

గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి స్థానానికి ఉప ఎన్నికల నిర్వహణకు జిల్లాలో సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నెల 5వ తేదీన ఎన్నికలు జరగనున్నాయని, దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లూ ఇప్పటికే పూర్తి చేశామన్నారు. జిల్లావ్యాప్తంగా 20 మండలాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటికే ఎన్నికల సామగ్రి ఆర్‌డిఒ కేంద్రాలకు తరలించామని, అక్కడి నుంచి మండల కేంద్రాలకు పంపిణీ చేస్తామని చెప్పారు. ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నిక నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను ప్రజాశక్తి ముఖాముఖిలో డిఆర్‌ఒ వెంకటేశ్వర్లు వెల్లడించారు.



ప్రశ్న: టీచర్ ఎంఎల్‌సి ఉప ఎన్నిక ఎప్పుడు జరగనుంది. పోలింగ్ ప్రక్రియ ఎన్ని గంటలకు ప్రారంభిస్తారు?

డిఆర్‌ఒ: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నికకు పోలింగ్ ఈ నెల ఐదో తేదీన జరగనుంది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ పోలింగ్ జరగనుంది. 9న ఓట్ల లెక్కింపు కాకినాడలో జరుగుతుంది.

ప్రశ్న: జిల్లాలో ఎంతమంది ఓటర్లు ఉన్నారు?

డిఆర్‌ఒ: జిల్లాలో 20 మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 3729 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 2268 మంది, మహిళలు 1461 మంది ఉన్నారు. ఉభయగోదావరి జిల్లాల పరిధిలో పశ్చిమగోదావరి జిల్లాలోనే అత్యధికంగా ఓటర్లు ఉన్నారు.



ప్రశ్న: ఎన్ని పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు? ఎంతమంది సిబ్బందిని నియమించారు?

డిఆర్‌ఒ: జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి మండల కేంద్రంలో ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశాం. ఒక్కో కేంద్రానికి ఒక పోలింగ్ ఆఫీసర్, మరో ముగ్గురు అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లను నియమించాం. జిల్లావ్యాప్తంగా సుమారు 80 మందిని నియమించాం. వీరితోపాటు అదనంగా 20 మందిని నియమించాం. ఒక డివిజన్‌ను ఒక క్లస్టర్‌గా విభజించాం. తాడేపల్లిగూడెం, భీమవరం, నరసాపురం క్లస్టర్లుగా విభజించి ఆయా ఆర్‌డిఒలకు బాధ్యతలు అప్పగించాం. అలాగే 20 రూట్లు ఏర్పాటు చేసి ఆయా తహశీల్దార్లకు రూట్ బాధ్యతలను అప్పగించాం.

ప్రశ్న: పోలింగ్ కేంద్రం వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏమైనా చర్యలు చేపట్టారా?

డిఆర్‌ఒ: టీచర్స్ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశాం. ప్రతి పోలింగ్ కేంద్రం వద్దా 144 సెక్షన్‌ను విధించాం. దీనికి సంబంధించి పోలీస్ శాఖ నుంచి సిబ్బందిని కూడా నియమించారు. ఎన్నికలకు 48 గంటల ముందు నుంచి జిల్లాలోని అన్ని మద్యం దుకాణాలను మూసివేసేలా చర్యలు తీసుకున్నాం. మూడో తేదీ సాయంత్రం నాలుగు గంటల నుంచి మద్యం దుకాణాలు మూసివేయాలి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని విధాలా చర్యలు తీసుకున్నాం. వీటిని అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వెనుకాడం.

ప్రశ్న: పోలింగ్ కేంద్రం వద్ద ఎటువంటి సౌకర్యాలు కల్పించారు?

డిఆర్‌ఒ: పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓటర్లు అసౌకర్యానికి గురికాకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లూ చేశాం. విద్యుత్, తాగునీరు, మెడికల్ క్యాంపు, బారికేడ్లు ఏర్పాటు చేశాం. ప్రతి ఓటరు నిర్భయంగా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతున్నాం.

ప్రశ్న: ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియ పూర్తయ్యిందా?

డిఆర్‌ఒ: ఎన్నికల సామగ్రికి సంబంధించిన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్లు, ఇతర సామగ్రి అంతా జిల్లా కేంద్రానికి చేరగా దాన్ని ఆయా ఆర్‌డిఒ కేంద్రాలకు ఇప్పటికే పంపిణీ చేశాం. జిల్లాలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు ఈ నెల 4వ తేదీన ఎన్నికల సామగ్రి మొత్తం పోలీస్ ఎస్కార్ట్ ద్వారా అందించే విధంగా చర్యలు చేపట్టాం.

ప్రశ్న: పోలింగ్ ముగిసిన తర్వాత సామగ్రిని ఎక్కడికి తరలిస్తారు?

డిఆర్‌ఒ: ఈ నెల 5వ తేదీన సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ముగిసిన తర్వాత ఆయా కేంద్రాల నుంచి పోలీస్ ఎస్కార్ట్‌తో బ్యాలెట్ బాక్సులను, ఇతర సామగ్రిని భీమవరంలోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ హాలుకు తరలిస్తాం. ఇక్కడ నుంచి రాత్రికి కాకినాడ కలెక్టరేట్‌కు తరలించేలా చర్యలు తీసుకున్నాం.

ఓటర్ల వివరాలు
(మండలాలవారీగా)


మండలం	ఓటర్ల సంఖ్య
1.అత్తిలి	90
2.ఆకివీడు	90
3.ఆచంట	63
4.భీమవరం	759
5.గణపవరం	66
6.ఇరగవరం	53
7.కాళ్ల	52
8.మొగల్తూరు	88
9.నరసాపురం	425
10.పెంటపాడు	73
11.పోడూరు	71
12.పాలకోడేరు	102
13.పెనుమంట్ర	85
14.పెనుగొండ	156
15.పాలకొల్లు	480
16.తాడేపల్లిగూడెం	377
17.తణుకు	407
18.ఉండి	69
19.వీరవాసరం	129
20.యలమంచిలి	94

కలవరం.. కలకలం..!

ఎన్నికలు పూర్తయ్యి కొత్త ప్రభుత్వం కొలువుదీరి సుమారు ఆరు నెలలవుతోంది. ఎన్నికల్లో జిల్లాలో ఘోర ఓటమి చవిచూసిన ప్రతిపక్ష వైసిపి ఇంకా ఆ ఓటమి నుంచి బయటపడకపోగా ప్రజాప్రతినిధులు, నేతలు ఒకొక్కరూ జారిపోతుండటం ఆ పార్టీ శ్రేణులను కలవరపరుస్తోంది. మరోపక్క అధికార పక్షమైన కూటమిలోనూ వివిధ అంశాల్లో టిడిపి, జనసేన నేతల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతుండగా టిడిపిలో సీనియర్, జూనియర్ నేతల మధ్య ఆంతరంగిక పోరు రోడ్డున పడటం, టిడిపి, జనసేన పోటాపోటీగా ప్రధాన నామినేటెడ్ పదవులు పశ్చిమకే కేటాయించి ఏలూరు జిల్లాకు మొండిచెయ్యి చూపడం ఇరు పార్టీల్లోనూ కలకలం సృష్టిస్తోంది.

ప్రతిపక్ష వైసిపికి ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ గుడ్‌బై చెప్పారు. టిడిపి నుంచి వైసిపి గూటికి చేరిన వెంటనే ఆయనకు ఎంఎల్ఎ కోటాలో ఎంఎల్‌సి పదవి దక్కింది. దీంతో కొల్లేరు ప్రాంతంలో మరోసారి విజయకేతనం ఎగురవేయొచ్చని వైసిపి భావించింది. అయితే దానికి భిన్నంగా కూటమి జోరులో వైసిపి ఉమ్మడి జిల్లాలోనే పత్తా లేకుండాపోయింది. ఈ క్రమంలో మాజీ మంత్రి ఆళ్ల నాని వైసిపిని వీడగా ఆపై ఏలూరు మేయర్, కార్పొరేటర్లు, జెడ్‌పి ఛైర్మన్ తదితరులు వైసిపిని వీడారు. తాజాగా జయమంగళ రాజీనామాతో మరోసారి ఆ పార్టీ శ్రేణుల్లో చర్చ మొదలైంది. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, మాజీ ఎంఎల్ఎలు ముదునూరి ప్రసాద్‌రాజు, మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, దూలం నాగేశ్వరరావు తప్ప ఆ పార్టీ మాజీ ఎంఎల్ఎలు, నేతలు ఎవరూ పెద్దగా రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనడం లేదు. పైగా ఎంఎల్‌సిలు వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్ సైతం అప్పుడప్పుడూ ప్రత్యక్షం కావడం మినహా బహిరంగ కార్యక్రమాల్లో పెద్దగా కన్పించడం లేదు. ఇక భీమవరం మాజీ ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ ఇప్పటికే పార్టీని వీడేందుకు సిద్ధం కావడం, ఆ పార్టీ మాజీ మంత్రులు రంగంలోకి దిగి బుజ్జగించిన సంగతి తెలిసిందే. ఏదేమైనా మాజీ ఎంఎల్ఎలు, ముఖ్య నేతలు సైతం పార్టీని వీడుతుండటంతోపాటు ఉన్న వారు సైతం పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా లేకపోవడం ఆ పార్టీ కేడర్‌లో ఆందోళన రేకెత్తిస్తోంది. జగన్ సంక్రాంతి తర్వాత చేపడతారని చెబుతున్న జిల్లావారీ సమీక్షల నాటికి ఇంకెంత మంది పార్టీని వీడతారోననే కలవరం ఆ పార్టీ శ్రేణుల్లో నెలకొంది.

ఇక అధికార పక్షమైన కూటమిలోని టిడిపి, జనసేనల్లోనూ ఆధిపత్య పోరుతోపాటు అంతర్గత కుమ్ములాటలు పెరుగుతున్నాయనే సంకేతాలు వెలువడుతున్నాయి. దీనికి నిదర్శనం నూజివీడు నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితే. టిడిపి, జనసేన నేతల మధ్య నెలకొన్న ఆధిపత్య పోరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రుల సమక్షంలో బయటపడిన సంగతి తెలిసిందే. తర్వాత పరిస్థితుల్లో



పెద్దగా మార్పులేమీ చోటుచేసుకోలేదని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. అదే సమయంలో నామినేటెడ్ పదవుల కోసం టిడిపిలో ఆంతరంగిక పోరు నెలకొందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. నూజివీడులో మాజీ ఎంఎల్ఎ ముద్రబోయిన వెంకటేశ్వరరావు, ఉంగుటూరు మాజీ ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు తదితరులు ఏలూరు జిల్లాలో పదవులు ఆశిస్తున్న నేతల్లో ముఖ్యులుగా ఉన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోనూ నామినేటెడ్ పదవులు ఎక్కువ కట్టబెట్టినా ఇంకా ఆ పదవుల కోసం క్యూలో ఉన్న వారి సంఖ్య పెద్దగానే ఉంది. అయితే నరసాపురంలో మహ్మద్ షరీఫ్‌కు క్యాబినెట్ ర్యాంకు పదవి, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడుకి కాపు కార్పొరేషన్ ఛైర్మన్ పదవి, ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజుకు, మాజీ ఎంఎల్ఎ మంతెన రామరాజుకు డిప్యూటీ స్పీకర్, ఎపిఐఐసి ఛైర్మన్ పదవులు దక్కగా, జనసేన తరపున భీమవరం ఎంఎల్ఎ అంజిబాబుకు పిఎసి ఛైర్మన్‌గా క్యాబినెట్ ర్యాంకు పదవి, అక్కడే వేగేశ్న కనకరాజు సూరికి రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి, విప్‌లుగా నరసాపురం, తాడేపల్లిగూడెం ఎంఎల్ఎలు బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్‌లకు పదవులు దక్కాయి. ఒకవిధంగా చెప్పాలంటే జనసేనకు చెందిన ముగ్గురు ఎంఎల్ఎలకు ఏదోక పదవి దక్కింది. ఇక టిడిపిలోనైతే ఆచంట, తణుకు ఎంఎల్ఎలు పితాని సత్యనారాయణ, ఆరిమిల్లి రాధాకృష్ణలకు ఎటువంటి ప్రత్యేక గుర్తింపూ దక్కలేదు. మంత్రి పదవి దక్కకపోవడంపై ఇప్పటికే పితాని అనుచరుల్లో అసంతృప్తి ఉందనడంలో ఎటువంటి సందేహమూలేదు. అలాగే మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి, మెంటే పార్థసారధి, వలవల మల్లికార్జునరావు (బాబ్జీ) తదితరులు పదవులు ఆశిస్తున్న జాబితాలో ఉన్నారు. ఈ క్రమంలోనే నూజివీడులో టిడిపి నేతల నడుమ విభేదాలు రోడ్డుకెక్కడం అందరినీ విస్మయపరుస్తోంది. ఎన్నికల ముందు వైసిపి నుంచి టిడిపి గూటికి చేరి ఇక్కడ నుంచి పోటీ చేసి గెలుపొందిన కొలుసు పార్థసారధి రాష్ట్ర మంత్రి పదవి సైతం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో తిరుగుబావుటా ఎగురవేసిన ముద్రబోయిన వెంకటేశ్వరరావును బుజ్జగించి ఎన్నికల తర్వాత సముచిత స్థానం కల్పిస్తామని అధిష్టానం హామీ ఇచ్చింది. అయితే నామినేటెడ్ పదవుల జాబితాలు వరుసగా వెలువడినా ముద్రబోయినకు చోటుదక్కలేదు. ఈ క్రమంలో ఆ నియోజకవర్గంలోని ముఖ్యనేత కాపా శ్రీనివాసరావు ముద్రబోయిన పార్టీకి నష్టం కల్గిస్తున్నారని, ఆయనను పార్టీ నుంచి బహిష్కరించాలని బహిరంగంగా డిమాండ్ చేయడం కలకలం సృష్టించింది. పోలవరం నియోజకవర్గంలోనూ టిడిపిలో బొరగం, మొడియం గ్రూపుల మధ్య విబేధాలు ఇప్పటికీ వీడకపోవడం అక్కడి పార్టీ శ్రేణులను ఇబ్బందులకు గురి చేస్తోంది. బొరగం శ్రీనివాసరావుకు నామినేటెడ్ పదవి దక్కడంతో గ్రూపు విబేధాలు సమసిపోతాయని అంతా భావించినా చాపకింద నీరులా పార్టీ శ్రేణులు రెండుగా చీలిపోయారని తెలుస్తోంది. ఏదేమైనా వరుస రాజీనామాలతో వైసిపి ఉక్కిరిబిక్కిరవుతుండగా.. తానేమీ తీసిపోనట్లు ఒకపక్క జనసేన, టిడిపి మధ్య ఆధిపత్య పోరు, మరోపక్క నేతల విబేధాలతో టిడిపి కూటమిలోనూ కలకలం నెలకొందనే వ్యాఖ్యానాలు విన్పిస్తున్నాయి.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఎక్సైజ్ సిఐ ఎస్.రాంబాబు


ప్రజాశక్తి - నరసాపురం



నరసాపురం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అనధికారంగా మద్యం అమ్మకాలు, బెల్ట్ షాపులు నిర్వహించినా, బెల్ట్ షాపులను ప్రోత్సహించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నరసాపురం ఎక్సైజ్ సిఐ ఎస్.రాంబాబు తెలిపారు. ఈమేరకు ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. గత రెండు రోజులుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వాయిస్ రికార్డ్ గురించి మాట్లాడుతూ బెల్టు షాపులను ప్రోత్సహించినా, నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నరసాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల మద్యం షాపు యజమానులను హెచ్చరించారు. నవంబర్ నెలలో మొత్తం 19 బెల్టు షాపులపై కేసులు నమోదు చేసి, 19 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 146 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నరసాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నాటుసారా, అనధికార మద్యం విక్రయాలు, బెల్ట్ షాపులు, గంజాయి అమ్మకాల గురించి 9440902438 అను నెంబర్‌కు సమాచారం ఇవ్వవలసిందిగా కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలియజేశారు.

మావుళ్లమ్మ సన్నిధిలో హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి - భీమవరం టౌన్



మావుళ్లమ్మ సన్నిధిలో గోపాలకృష్ణారావు దంపతులు

శ్రీ మావుళ్లమ్మ అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ జస్టిస్ వి.గోపాలకృష్ణారావు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మ మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు జరిపి వేద ఆశీర్వచనాలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ద మహాలక్ష్మి నగేష్ న్యాయమూర్తిని ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో భీమవరం అడిషనల్ ఎస్‌పి భీమారావు, భీమవరం తహశీల్దార్ రావి రాంబాబు, సిఐ నాగరాజు పాల్గొన్నారు.

క్షీర రామలింగేశ్వర స్వామి ఆలయంలో..

పాలకొల్లు : హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాలకృష్ణారావు కుటుంబ సమేతంగా పాలకొల్లు శ్రీక్షీర రామలింగేశ్వర స్వామివారిని ఆదివారం దర్శించుకున్నారు. కార్తీకమాసం చివరి రోజు ఆయన స్వామి వారి దర్శనం చేసుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ప్రసాదాలు, ఫొటో అందించారు. ఆయన కూడా ఆలయ ఇఒ ముచ్చర్ల శ్రీనివాస్, పాలకొల్లు న్యాయమూర్తులు, బార్ కౌన్సిల్ సభ్యులు, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయాలి

సిపిఎం మండల కార్యదర్శి ఆశ్రియ్య

ప్రజాశక్తి - పాలకోడేరు

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని శేషాపు ఆశ్రియ అన్నారు. పాలకోడేరు సిపిఎం కార్యాలయంలో ఆదివారం సిపిఎం మండల కమిటీ సమావేశం నాయకులు కోటికలపూడి శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రియ మాట్లాడుతూ అనేక హామీలు ఇచ్చి, అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించడం సిగ్గుచేటు అన్నారు. సూపర్ సిక్స్ పథకాలని చెప్పి ఏ ఒక్కటి అమలు చేయలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ భారాలు మోపి సామాన్యులను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టేస్తున్నారన్నారు. సమస్యల పరిష్కారానికి కలిసి పోరాడాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఈ సమావేశంలో నాయకులు దున్న మరియమ్మ, సత్యనారాయణ పాల్గొన్నారు.

దేవ గ్రామానికి చినబాబు మృతదేహం

కుటుంబసభ్యులు కన్నీటిపర్యంతం

ప్రజాశక్తి - పెనుగొండ

ఉపాధి నిమిత్తం కువైట్ దేశం వెళ్లిన గునపాటి చినబాబు(40) కువైట్ దేశంలో ఈ నెల 27వ తేదీన గుండెపోటుతో మృతిచెందిన సంఘటన విధితమే. ఈ నేపథ్యంలో గునపాటి చినబాబు మృతదేహం కువైట్ నుంచి శనివారం సాయంత్రం పెనుగొండ మండలం దేవ గ్రామానికి చేరుకుంది. చినబాబు పార్థీవ దేహాన్ని చూసి భార్య, ఇద్దరు కుమారులు, తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. వారి ఆర్తనాధాలతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతదేహం చూసి ఆ గ్రామస్తులు కంటతడి పెట్టారు. పిల్లల్ని చదివించుకునే నిమిత్తం ఉపాధి కోసం ఇతర దేశం వెళ్లి శాశ్వతంగా దూరమైపోయారని కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం క్రైస్తవ సాంప్రదాయం ప్రకారం చినబాబు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

న్యాయవాది శ్రీనివాస్ చిత్రపటం ఆవిష్కరణ

ప్రజాశక్తి - నరసాపురం

ప్రజలకు సత్వర న్యాయం అందాలంటే పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల సంఖ్య పెరగాలని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. నరసాపురం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో కీర్తిశేషులు, న్యాయవాది కొమాండూరి శ్రీనివాస్ చిత్రపట ఆవిష్కరణ కార్యక్రమం స్థానిక తెలగా కళ్యాణ మండపంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చలమేశ్వర్ మాట్లాడుతూ తాను న్యాయవాద వృత్తిని చేపట్టిన తొలిరోజుల్లో రాష్ట్రంలోని పలు జిల్లా కేంద్ర న్యాయస్థానాల్లో ఉద్దండులైన న్యాయవాదులు తమ వాదనా పటిమతో పలు సమస్యల పరిష్కారానికి కృషి చేసారని గుర్తు చేసారు. న్యాయస్థానాల్లో క్రిమినల్ అప్పీళ్లు ఎక్కువ కాలం పెండింగ్‌లో ఉండాల్సిన అవసరం లేదన్నారు. ఈ కేసులు ఎక్కువ కాలం పెండింగ్‌లో ఉండటానికి అందరూ కారకులేనని ఆయన వివరించారు. అంతేకాకుండా సివిల్ తగాదాలలో పోలీసు జోక్యం పెరగడాన్ని కూడా చూస్తున్నామని, వీటివల్ల సమస్యలు జటిలమతాయని ఆయన తెలిపారు. కొమాండూరి శ్రీనివాస్ వంటి న్యాయవాదులు చేసిన మంచి పనులను అనుసరించడమే ఆయనకు అర్పించే నివాళి అని చలమేశ్వర్ అన్నారు. జిల్లా అదనపు న్యాయమూర్తి పి.విజయదుర్గ, సీనియర్ సివిల్ జడ్జి కె.గంగరాజు, జూనియర్ సివిల్ జడ్జి ఆర్.వరలక్ష్మి, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కె.శ్రీనివాస్, పలువురు న్యాయవాదులు, కొమాండూరి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నరసాపురం కోర్టులో జిరాక్స్ సెంటర్ ప్రారంభం

నరసాపురంలోని న్యాయస్థాన సముదాయంలో నూతనంగా ఏర్పాటు చేసిన జిరాక్స్ సెంటర్‌ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి, పశ్చిమగోదావరి జిల్లా పరిపాలనా వ్యవహారాల న్యాయమూర్తి జస్టిస్ కె.సురేష్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు.

స్టెత్‌స్కోప్ వదిలి.. లాఠీ పట్టుకుని..!

నాన్న స్ఫూర్తితో పోలీసు ఉద్యోగానికి ప్రయత్నం
తొలి ప్రయత్నంలోనే విజయం
అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు
నరసాపురం డిఎస్‌పి డాక్టర్ శ్రీవేద

చిట్ చాట్



డిఎస్‌పి శ్రీవేద

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం సబ్ డివిజన్‌లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని నరసాపురం డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద హెచ్చరించారు. 2022 బ్యాచ్‌కు చెందిన గ్రూప్-1 అధికారిని ఈమె. నరసాపురం డిఎస్‌పిగా పనిచేస్తున్న రెండో మహిళా డిఎస్‌పి కావడం విశేషం. పోలీస్ శాఖలో పనిచేయాలనే లక్ష్యంతో డాక్టర్‌గా పనిచేస్తూనే గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యారు. తొలి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించినట్లు తెలిపారు. ఈమె మొదటి పోస్టింగ్ నరసాపురం డిఎస్‌పిగా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఈమె శనివారం ప్రజాశక్తితో మాట్లాడారు.

ప్రశ్న : మీ సబ్ డివిజన్ పరిధిలో ఎన్ని స్టేషన్స్ ఉన్నాయి? ఎంత మంది అధికారులు ఉన్నారు?

డిఎస్‌పి : సబ్ డివిజన్‌లో మొత్తం 10 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ఐదుగురు సిఐలు, 13 మంది ఎస్ఐలు ఉన్నారు.

ప్రశ్న : ఇటీవల కాలంలో సబ్ డివిజన్‌లో దొంగతనాలు పెరిగాయి, దొంగతనాల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

డిఎస్‌పి : దొంగతనాల నివారణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసాము. గతంలో నమోదైన కేసులపై ఇప్పటికే దృష్టి పెట్టాం. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సైతం దొంగలను పట్టుకుంటాం. ప్రభుత్వం, దాతల సహకారంతో గ్రామాల్లో, సెంటర్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం. జైలు నుంచి విడుదలైన ముద్దాయిలపై నిఘా పెట్టాం. ఇప్పటికే సబ్ డివిజన్‌లోని క్రైమ్ పార్టీ సిబ్బందితో రివ్యూ మీటింగ్ సైతం ఏర్పాటు చేశాం. 24 గంటలూ గ్రామాల్లో బీట్లు ఏర్పాటు చేసాం.

ప్రశ్న : విద్యార్థులకు మీరేమైనా చెప్పాలనుకుంటున్నారా?

డిఎస్‌పి : విద్యార్థులు ఎవరూ ప్రేమ పేరుతో మోసపోవద్దు. తల్లిదండ్రులను ఎవరూ బాధ పెట్టవద్దు. ఎవరైనా ప్రేమ పేరుతో వేధించినా, అసభ్యంగా ప్రవర్తించినా ధైర్యంగా తమకు ఫిర్యాదు చేయండి, చర్యలు తీసుకుంటాం. పరీక్షలు దగ్గర పడుతున్నాయి కావున బాగా శ్రద్ధ పెట్టి చదువుకోండి. సమయాన్ని వృథా చేసుకోవద్దు.

ప్రశ్న : యువతకు మీరు ఇచ్చే సూచన ఏంటి?

డిఎస్‌పి : మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి. నేటి తరంలో పోటీతత్వం పెరిగింది. కావున పరీక్షలకు పక్కాగా ప్రణాళిక రచించి, ఉద్యోగాలు సాధించుకోవాలి. ఎవరూ కూడా కేసుల్లో చిక్కుకోవద్దు. చెడు వ్యసనాలకు బానిసై, బంగారం లాంటి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు. ఫోన్లకు దూరంగా ఉండి, పుస్తకాలకు దగ్గర అవ్వండి.

ప్రశ్న : ఫోక్సో కేసుల సంఖ్య పెరుగుతున్నాయి, నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

డిఎస్‌పి : కళాశాల, పాఠశాల వద్ద పోలీస్ నిఘా పెడుతున్నాము. ప్రేమ పేరుతో ఎవరూ మోసపోవద్దు. మహిళా ఎస్ఐలతో ఇప్పటికే విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాము. గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై తల్లిదండ్రులు పిల్లలకు వివరించాలి. పోలీసులతో పాటు తల్లిదండ్రులు పిల్లలు ఏమి చేస్తున్నారు? ఎవరితో ఫ్రెండ్‌షిప్ చేస్తున్నారు? అనేవి ఆరా తీయాలి. లైంగిక వేధింపులు ఎదుర్కొంటే ధైర్యంగా ఫిర్యాదు చేయండి. తప్పు చేసిన వారికి శిక్ష పడుతుంది.

ప్రశ్న : రోడ్డు ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్ నిరోధానికి ఏమి చర్యలు తీసుకుంటున్నారు?

డిఎస్‌పి : రోడ్డు ప్రమాదంలో జరిగే ప్రదేశాలను గుర్తించి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం. ట్రాఫిక్ ఉండే ప్రదేశాల్లో సిగ్నల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. మైనర్లు వాహనాలు నడిపితే వాహనాలు సీజ్ చేస్తాం. హెల్మెట్ లేకుండా, మద్యం తాగి వాహనాలు నడపవద్దు. ప్రధాన సెంటర్లో రోడ్లు ఆక్రమణకు గురైతే ఇతర అధికారులతో కలిసి ఆక్రమణలు తొలగిస్తాం.

ప్రశ్న : సబ్ డివిజన్లో కోడిపందేలు, పేకాట ఎక్కువగా జరుగుతున్నాయి, వీటి నివారణకు ఏమి చర్యలు తీసుకుంటున్నారు?

డిఎస్‌పి : కోడిపందేలు, పేకాటలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాం. ఎక్కడన్నా కోడిపందేలు, పేకాట జరిగితే 100కు సమాచారం అందించండి. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుంది. ఇప్పటికే కోడిపందేలు, పేకాట శిబిరాలపై దాడులు నిర్వహించి, కేసులు నమోదు చేస్తున్నాము. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, ప్రజలకు ఇబ్బంది కలిగించినా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : ఎక్కువగా సబ్ డివిజన్‌లో ఏ కేసులు నమోదవుతున్నాయి?

డిఎస్‌పి : సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో తనిఖీ చేస్తున్నాను. ఒక్కొక్కచోట ఒక్కొక్క కేసులు నమోదు అవుతున్నాయి. ఎక్కువగా భార్యాభర్తల గొడవలు, ఆత్మహత్యలు, సైబర్ నేరాలు, కొట్లాట, చీటింగ్ కేసులు నమోదు అవుతున్నాయి.

ప్రశ్న : సైబర్ నేరాల నివారణకు చర్యలు ఏమి తీసుకుంటున్నారు?

డిఎస్‌పి : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. తెలియని వ్యక్తులు, వెబ్‌సైట్లకు వ్యక్తిగత సమాచారం ఇవ్వరాదని, అన్ని అకౌంట్లకు విభిన్నమైన, స్ట్రాంగ్ పాస్వర్డ్స్ ఉపయోగించాలన్నారు. అనుమానితమైన ఏదైనా విషయం గమనిస్తే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలి లేదా హెల్ప్ లైన్ నెంబర్ 1930కు ఫోన్ చేయాలన్నారు.

ప్రశ్న : డాక్టర్ నుంచి పోలీస్ ఉద్యోగానికి ఎందుకు వచ్చారు, మీకు స్ఫూర్తి ఎవరు?

డిఎస్‌పి : డాక్టర్ అంటే కొన్ని ఏరియాలో కొంత సమయం మాత్రమే సేవ చేస్తాము. పోలీసు అయితే రాష్ట్రమంతా సేవలు చేయవచ్చు. డాక్టర్‌గా పనిచేస్తూ పోలీసు ఉద్యోగానికి ప్రయత్నించాను. నాన్న రిటైర్డ్ ఐజీగా పనిచేశారు. నాన్నను స్ఫూర్తిగా తీసుకొని పోలీస్ ఉద్యోగం సాధించాను.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం ఎడిఆర్ డాక్టర్ శ్రీనివాస్

పెనుమంట్ర : తుపాన్ నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు చేపట్టి పంట నష్టాన్ని నివారించుకోవాలని ఆచార్య ఎన్‌జి రంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధానా స్థానం ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్ అన్నారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కోతకి సిద్ధంగా ఉన్న వరి పంటని వర్షాలకు ముందు కోయరాదన్నారు. కోసినా పూర్తిగా ఆరని పనలను తుపాన్ నేపథ్యంలో కుప్పలు వేసేటప్పుడు ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లుకుంటూ కుప్పవేసుకోవడం వల్ల నష్టాన్ని నివారించుకోవచ్చని తెలిపారు. కోత కోసి పొలంలో ఉన్న పనలు వర్షానికి తడిచినట్లైతే గింజ మొలకెత్తకుండా ఉండడానికి 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పడేవిధంగా పిచికారీ చేయాలన్నారు. ఒక వేళ పొలంలో నీరు నిలిచి ఉన్నట్లయితే పనలను గట్ల పైకి తెచ్చుకొని, విడగొట్టి, ఉప్పు ద్రావణం చల్లుకోవాలన్నారు. వర్షాలు తగ్గి ఎండ రాగానే పనలను తిరగేసి ఎండబెట్టి నూర్చుకోవాలన్నారు. కల్లాల మీద ఉన్న ధాన్యాన్ని వర్షానికి తడవకుండా భద్రపరుచుకోవాలని, నూర్చిన ధాన్యం 2-3 రోజులు ఎండ బెట్టడానికి వీలు కాకపోతే కుప్పలలో గింజ మొలకెత్తడమే కాక రంగు మారి, చెడు వాసన వస్తుందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో నష్టాన్ని నివారించడానికి ఒక క్వింటాలు ధాన్యానికి ఒక కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక కలిపి ధాన్యం పోగు పెట్టడం వల్ల గింజ మొలకెత్తకుండా, చెడిపోకుండా నివారించుకోవచ్చు. ఎండ కాసిన తరువాత ధాన్యాన్ని ఎండబోసి, తూర్పార బట్టి నిలవ చేసుకోవాలని సూచించారు. రంగు మారి, తడిచిన ధాన్యం పచ్చి బియ్యం కంటే ఉప్పుడు బియ్యంగా అమ్ముకోవడం వల్ల నష్టాన్ని కొంత వరకు తగ్గించుకోవచ్చన్నారు. పిగులు పొట్ట, పూత దశలో పైరు 1 నుంచి 2 రోజుల కన్నా ఎక్కువ రోజులు నీట మునిగితే కంకి పూర్తిగా బయటకు రాకపోవడం, పుష్పాలలో నీరు చేరడం వల్ల ఫలదీకరణ శక్తి కోల్పోయి తాలు, రంగుమారిన గింజలు ఏర్పడతాయన్నారు. గింజ రంగు మారకుండా ఉండటానికి లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం లేదా రెండు గ్రాముల కార్బెండిజం ౦ మాంకోజెబ్ లేదా 1 మీ.లీ ప్రోపికొనజోల్ మందును పిచికారీ చేయాలన్నారు. మొక్క కోలుకున్న తరువాత కుళ్లు తెగుళ్లు రాకుండా లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం కలిపి పిచికారీ చేయాలి. పొలంలో నుల్చున్న నీరు మురుగు కాలువల ద్వారా బయటకు వెళ్లేటట్లు బాటలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

సంక్షేమ బోర్డును పరిరక్షించుకోవాలి

కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలి
బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు చిన వీరభద్రరావు

ప్రజాశక్తి - తణుకు రూరల్

భవన నిర్మాణ కార్మికులు ఎంతో సాధించి తెచ్చుకున్న సంక్షేమ బోర్డు పరిరక్షణకు కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు బళ్ల చిన వీరభద్రరావు పిలుపునిచ్చారు. సిఐటియు అనుబంధ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశం స్థానిక పార్వతీదేవి ఆలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. యూనియన్ అధ్యక్షులు యర్రా మల్లికార్జున రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో యూనియన్‌లో సభ్యులుగా ఉన్న కార్మికుల కుటుంబంలో ప్రసవం అయిన బాలింతలకు బేబీ కిట్‌లు కానుకగా అందజేశారు. అనంతరం వీరభద్రరావు మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఆరేళ్లుగా సంక్షేమ బోర్డులో నిధులను ఇతర పథకాలు అమలుకు తరలించుకుపోయి, బోర్డుని నిర్వీర్యం చేశారన్నారు. కార్మికులకు పథకాలు అమలు చేయకుండా, మొండి చేయి చూపించారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, దాదాపు 6 నెలలు కావస్తున్నప్పటికీ ఇచ్చిన వాగ్దానం నేటికీ అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఇటీవల కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ శాసనసభలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పెళ్లికి కళ్యాణమస్తు పథకం అమలు, ప్రమాదంలో మరణించిన వారికి బీమా పథకం ద్వారా నష్టపరిహారం అందిస్తున్నామని, కాబట్టి కార్మికులకు బోర్డు ద్వారా ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయవలసిన అవసరం లేదని మంత్రి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బోర్డు ద్వారా కార్మికులకు అమలు చేసే సంక్షేమ పథకాలకు బడ్జెట్లో ప్రభుత్వం ఎటువంటి నిధులు కేటాయించాల్సిన అవసరం లేదని మంత్రి తెలుసుకోవాలని వీరభద్రరావు సూచించారు. కార్మికులు నిర్మిస్తున్న నిర్మాణ కట్టడాలకు యజమానుల నుంచి సెస్ రూపంలో బోర్డుకి జమవుతున్న నిధులనే కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు పెట్టే విధంగా కార్మికులు ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న హక్కు అని ఆయన తెలిపారు. సంక్షేమ బోర్డులో నిల్వ ఉన్న రూ.1000 కోట్ల నిధులను విడుదల చేసి పెళ్లికానుక, డెలివరీ పారితోషకం, ప్రమాద బీమా వంటి పథకాల నిమిత్తం దరఖాస్తు చేసుకున్న 2007 మందికిపైగా ఉన్న లబ్ధిదారులకు పెండింగులో ఉన్న క్లైయిమ్‌లు తక్షణం మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికుల్ని సమీకరించి ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీరవల్లి వెంకన్న, వాటాల నాగేశ్వరరావు, సోరపల్లి రామకృష్ణ, గొల్లపల్లి రాజా, పిల్లి పరమేశ్వరరావు, విప్పర్తి రవీంద్ర, గుడిమెట్ల రాధాకృష్ణ, గరికపాటి మహేష్ పాల్గొన్నారు.

వర్షాలతో రైతాంగం విలవిల

పంట రక్షణ చర్యలు చేపట్టాలి


పాలకోడేరు వ్యవసాయాధికారి నారాయణరావు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో వరిసాగు ఎక్కువగా సాగుతుంది. దీని మీద అనేక వ్యవసాయ కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. అయితే ముమ్మరంగా మాసూల్లు జరుగుతున్న సమయంలో వాతావరణంలో ఏర్పడిన ముసురుతో రైతులు సతమతమవుతున్నారు. 15 రోజుల కిందటే కోతలు ప్రారంభమయ్యాయి. పంట చేతికొచ్చే కీలకమైన ఈ సమయంలో ఎక్కువగా వర్షాలు కురవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో దాదాపు 2 లక్షల 16 వేల ఎకరాల్లో భారీస్థాయిలో సాగు చేస్తున్నారు. అయితే అకాల వర్షాలు రైతులను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పంటను రక్షించుకునేందుకు పాలకోడేరు మండల వ్యవసాయ అధికారి వి.నారాయణరావు రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు.

ఎపిటిఐడిసిఒ ఛైర్మన్‌ను కలిసిన పోలిశెట్టి

ప్రజాశక్తి - నరసాపురం



అజయ్ కుమార్‌ని సత్కరిస్తున్న పోలిశెట్టి శ్రీనివాస్

ఆంధ్రప్రదేశ్ టౌన్ షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఎపిటిఐడిసిఒ) ఛైర్మన్ వేములపాటి అజయ్ కుమార్‌ని ఆదివారం విజయవాడలో నరసాపురం జనసేన నాయకులు పోలిశెట్టి శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్‌కు శ్రీనివాస్ పుష్పగుచ్చం అందజేసి, శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఇరువురు పలు రాజకీయ అంశాలపై చర్చించుకున్నారు.

ఆడిటర్ రామరాజు మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు



పాలకొల్లు కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ గౌరవ అధ్యక్షులు, క్షత్రియ సంక్షేమ పరిషత్ అధ్యక్షులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ కరస్పాండెంట్, సెక్రటరీ కలిదిండి రామరాజు(77)(ఆడిటర్ రామరాజు) ఆదివారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన మృతికి ఛాంబర్, కాస్మో, క్షత్రియ పరిషత్ సభ్యులు, ఆడిటర్లు సంతాపం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు ఆయన స్వగృహం పాలకొల్లులోని లజపతిరాయ్ పేట నుంచి అంతిమయాత్ర బయలుదేరింది. కోనసీమ జిల్లా రాజోలు మండలం సొంపల్లి వద్ద అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆడిటర్ రామరాజు మృతి బాధాకరం
అంత్యక్రియల్లో పాడె మోసిన మంత్రి రామానాయుడు

పాలకొల్లు కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ గౌరవ అధ్యక్షులు, ప్రముఖ ఆడిటర్ కలిదిండి రామరాజు మృతి పట్ల మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. రామరాజు మృతి సమాచారం తెలియగానే ఆయన నివాసానికి వెళ్లి భౌతికకాయంను సందర్శించి, పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. రామరాజు కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. రామరాజు అంత్యక్రియల్లో పాడిని స్వయంగా మంత్రి రామానాయుడు మోసారు. రాజోలు మండలం సోంపల్లి వద్ద జరిగిన అంత్యక్రియల్లోనూ మంత్రి పాల్గొన్నారు. రామరాజుతో తనకున్న అనుబంధాన్ని తలుచుకున్నారు.



రామరాజు పాడె మోస్తున్న మంత్రి నిమ్మల

కాపు కళ్యాణ మండపం నిర్మాణానికి కృషి : మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో గత 20 సంవత్సరాలుగా కలగా మిగిలిన కాపుల కళ్యాణ మండపానికి తాను కృషి చేస్తానని, ప్రభుత్వం నుంచి రూ.3 నుంచి 5 కోట్ల మంజూరుకు కృషి చేస్తానని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. స్థానిక అడబాల గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన కాపు, తెలగ వనమహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 2029 ఎన్నికలకు ముందే కళ్యాణ మండపం రూపం దాల్చి ఆనాడు వనమహోత్సవాన్ని ఆ కళ్యాణ మండపంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. మహిళలు విద్యావంతులు అయితేనే ఆ కుటుంబం వృద్ధిలోకి వస్తుందని చెప్పారు. పవన్ కళ్యాణ్, చంద్రబాబుల కలయికతో రాష్ట్రం పురోభివృద్ధి జరుగుతోందన్నారు. పలుమార్లు పవన్ కళ్యాణ్ పేరు చెప్పగానే యువకులు కేరింతలు కొట్టి అభిమానం చాటారన్నారు. పవన్ కళ్యాణ్ కృషితో గ్రామీణాభివృద్ధికి నిధుల కేటాయింపు ఎక్కువ జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమని చెప్పారు. కాపులు ఇంకా విద్యావంతులు కావాల్సిన అవసరం ఉందన్నారు. వన సమారాధనలో కాపు నేతలు చేగొండి హరరామ జోగయ్య, గుణ్ణం నాగబాబు, అడబాల వెంకట రమణ, వంగా నరసింహారావు, డాక్టర్ ముచ్చర్ల సంజయ్ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర కళాశాలలో ఎన్‌సిసి క్యాడెట్లకు శిక్షణ

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం 7 ఆంధ్రా నేవల్ యూనిట్ ఆధ్వర్యంలో ఎన్‌సిసి క్యాడెట్లకు ఫైరింగ్‌పై శిక్షణ ఇచ్చారు. యూనిట్ కమాండర్ కెప్టెన్ వై.ప్రదీప్, డిప్యూటీ క్యాంపు కమాండర్ లెఫ్టినెంట్ సంజీత్ రౌత్రేలు శిక్షణ ఇచ్చారు. అనంతరం కమాండర్లు మాట్లాడుతూ క్యాడేట్లు క్రమశిక్షణ, ఏకాగ్రత చాల ముఖ్యమన్నారు. ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా తెలుసుకునేందుకు ప్రయత్నించాలన్నారు. మెడిటేషన్, స్పోర్ట్స్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిఐ స్టాఫ్, మిలటరీ, సివిల్, ఎఎన్ఒ సిబ్బంది పాల్గొన్నారు.

అఖండ అన్నసమారాధన

ప్రజాశక్తి - ఆచంట

కార్తీకమాసం ముగింపు రోజున ఆదివారం శ్రీరామేశ్వర స్వామి వారి ఆలయం ప్రాంగణంలో అఖండ అన్న సమారాధన నిర్వహించారు. ప్రతియేటా యాత్రికుల విరాళాలతో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. గ్రామానికి చెందిన యాత్రికులు విరాళాలు పోగు చేసి పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. సుమారు 6 వేల మంది యాత్రికులు అన్న ప్రసాదం స్వీకరించారు. ముందుగా ఉసిరి చెట్టుకు పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఛైర్మన్ నెక్కంటి గజేశ్వరరావు, ఆలయ కార్యనిర్వాహణ అధికారి ఆదిమూల వెంకట సత్యనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఆచంట ఎస్ఐ వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు.

ముత్యాలమ్మ ఆలయానికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కలకలలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. ఆలయ కార్య నిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావుల పర్యవేక్షణలో సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ప్రసాదం వితరణ, తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ఎపిజిఇఎ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని వైఎన్ కళాశాల సెమినార్ హాల్లో ఆదివారం మండల సచివాలయ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. దీనికి ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు జిఆర్ఎస్ఎన్ రాజు, అసోసియేషన్ అధ్యక్షులు వై.మోహనరావు హాజరై మాట్లాడారు. అనంతరం నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షులుగా వి.వి.లక్ష్మి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. పని ఒత్తిడి తగ్గించాలని, పై స్థాయి అధికారుల వేధింపులు, మహిళా ఉద్యోగుల సమస్యలు, జాబ్ ఛార్జ్ సర్వీస్ రూల్స్, ప్రమోషన్, హేతుబద్ధంగా ఇన్‌ఛార్జీలు, సాధారణ సెలవుకు ముగ్గురు అధికారుల చుట్టూ తిరగడం, పబ్లిక్ సెలవుల్లో కూడా పని చేయడం తదితర సమస్యలపై ఉద్యోగులు చర్చించారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై స్పందించకపోతే భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాలని సంఘం నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో సచివాలయ మండల ఉద్యోగులు పాల్గొన్నారు.

నిర్మానుష్యంగా పేరుపాలెం బీచ్

ప్రజాశక్తి - మొగల్తూరు


మండలంలోని పేరుపాలెం బీచ్ ఆదివారం నిర్మానుష్యంగా మారింది. కార్తీకమాసం ఆఖరి వారం కావడంతో పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చారు. అధికారులు పర్యాటకులను, ప్రకృతి ప్రేమికులను బీచ్‌కు ఎవరినీ అనుమతించలేదు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో సముద్రపు కెరటాలు ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. సముద్ర కెరటాలు సుమారు 100 మీటర్లు ముందుకు రావడంతో అధికారులు పర్యాటకులెవరినీ అనుమతించలేదు.

నేరాలు - ఘోరాలు

బెల్టు షాపు నిర్వాహకుని అరెస్టు

8 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - తణుకు రూరల్



వివరాలు వెల్లడిస్తున్న సిఐ

తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆదివారం నిర్వహించిన దాడులలో తణుకు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన తటవర్తి మల్లికార్జునరావు అనే వ్యక్తిని బెల్ట్ షాపు నిర్వహిస్తున్న కారణంగా అరెస్టు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సిఐ ఎస్.మణికంఠ రెడ్డి తెలిపారు. అతని వద్ద నుంచి 8 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడులలో ఎస్ఐ బి.లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు.